మాడుగుల సబ్ రిజిస్ట్రార్‌గా సంజీవయ్య

» ఐజీ కార్యాలయం నుంచి బదిలీ

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్ సంజీవయ్యను విజయవాడ ఐజీ కార్యాలయం నుంచి అనకాపల్లి జిల్లా మాడుగుల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆయన జోన్-1 అంటే ఉత్తరాంధ్రాకు చెందిన అధికారి. గతంలో మధురవాడ, భీమిలి కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. భీమిలిలో ఉన్నప్పుడు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఏసీబీ కేసు నమోదైంది. అది విచారణలో ... మిగతా 6వ పేజీలో

సమగ్ర శిక్షాలో అక్రమాలెన్నో!

విచారణలో ఒక్కొక్కటిగా వెలుగులోకి..

» అడ్డగోలుగా డిప్యూటేషన్లు

» వాస్తవానికి భర్తీ చేయాల్సిన పోస్టులు 8

» కానీ ఖాళీలు చూపించింది 5 మాత్రమే

» వాటిల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

» ఇప్పటికే ఏపీసీపై వేటు, మరికొందరిపై చర్యలకు సిద్ధం



అనకాపల్లిలో సమగ్ర శిక్షా కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లా విద్యాశాఖలోని సమగ్ర శిక్షా విభాగంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తీగ లాగితే డొంక కదులుతున్న చందంగా శాఖలో అడ్డగోలు డిప్యూటేషన్ నియామకాల వ్యవహారాలు బహిర్గతమవుతున్నాయి. సమగ్ర శిక్షా విభాగంలో గుట్టుగా సాగిన అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంపై పాఠశాల విద్యాశాఖకు అప్పట్లో సాక్షాత్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

జిల్లాలో ఈ ఏడాది మే నెలలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులను ఫారిన్ సర్వీసు, డిప్యూటేషన్‌పై భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ డిప్యూటేషన్ నియామకాల్లోనే పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సమగ్ర శిక్షా విభాగంలో నియామకాలు చేపట్టినట్టు పలు ఉపాధ్యాయ సంఘాలు అప్పట్లో ఫిర్యాదులు చేశాయి. దీనిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పందించి విశాఖపట్నంలో పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉదయభాస్కర్ ద్వారా ఇటీవల విచారణ జరిపించారు. వారం రోజుల కింద విశాఖలో జరిగిన విచారణలో జిల్లా సమగ్ర శిక్షాలో డిప్యూటేషన్ల నియామకాల్లో అనేక అక్రమాలు జరిగినట్టు గుర్తించారని సమాచారం. నోటిఫికేషన్ జారీ సమయంలో పేర్కొన్న నిబంధనలను పక్కన పెట్టి అడ్డగోలుగా నియామకాలు జరిపినట్టు విచారణలో తేలడంతో ప్రభుత్వానికి ఆయన నివేదిక పంపినట్టు తెలిసింది. జిల్లా విద్యాశాఖకు అనుబంధంగా పనిచేసే సమగ్ర శిక్షా విభాగం ద్వారా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు అవుతుంటాయి. పని ఒత్తిడి తక్కువ, రాబడి ఎక్కువ ఉంటుంది. జిల్లా కేంద్రంలో ఉంటూ విధులు నిర్వహించవచ్చు. దీంతో సమగ్ర శిక్షా విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆసక్తి చూపుతుంటారు. పోస్టుల నియామకాల కోసం సిఫారసు లేఖలు తెచ్చుకుంటారు. డీఈవో, సమగ్ర శిక్షా ఏపీసీ ఉమ్మడి ఆధ్వర్యంలో నియామకాలు జరగాల్సి ఉండగా, ఏపీసీ అన్నీ తానై వ్యవహరించినట్టు సమాచారం. డీఈవో ప్రమేయం లేకుండా సమగ్ర శిక్షా విభాగంలో డిప్యూటేషన్‌పై నియామకాలు జరిపారు.

విచారణలో తేలిన అక్రమాలు

జిల్లా సమగ్ర శిక్షా విభాగంలో 8 పోస్టుల్లో భర్తీకి నియామకాలు జరగాల్సి ఉంది. కానీ ఏడు పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. ఒక పోస్టులో నియామకం కోసం పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఒక అధికారి సిఫారసుతో నియామకం జరిగిపోయింది. మిగిలిన ఏడు పోస్టుల్లో నాలుగేళ్ల కాలపరిమితిపై డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంటుంది. కానీ సంబంధిత శాఖాధికారులు నోటిఫికేషన్ జారీలో కేవలం ఐదు పోస్టులకే ఖాళీలు చూపారు. అంతే కాకుండా నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు పాటించకుండా నియామకాలలో యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడ్డారు. విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నా, సమగ్ర శిక్షా అధికారులు వాటిని పక్కన పెట్టేశారు. ఎటువంటి నిబంధనలు పాటించకుండా తమకు అనుకూలంగా ఉన్నవారిని, ముడుపులు ముట్టజెప్పిన వారికి, సరైన విద్యార్హతలు లేకుండానే నియామకాలు జరిపేశారు. గతంలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ కార్యాలయంలోనే విధుల్లో కొనసాగించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టు నియామకానికి నోటిఫికేషన్‌లో గణితం, స్టాటస్టిక్స్‌లో పీజీ చదివిన, లేదా డిప్లొమా ఇన్ ... మిగతా 6వ పేజీలో

ఇదేం తీరువా?

డివిజన్‌లో నీటి తీరువా బకాయిలు రూ.15 కోట్లు

» మొత్తం 2,01,493 ఖాతాలు

» సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో చెల్లింపులు

» వసూళ్లు చేయాల్సింది కొండంత, చేసింది గోరంత

» రైతుల నుంచి సాగునీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం

» కొండలా పేరుకుపోయిన బకాయిలు



తాండవ మేజర్ ప్రాజెక్టు

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
డివిజన్ నీటి తీరువా బకాయిలు కొండలా పేరుకుపోయాయి. రైతుల నుంచి నీటి తీరువా ద్వారా వసూలు చేసిన నిధులు సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధికి, మరమ్మతులకు ఉపయోగిస్తారు. అయితే 2007 నుంచి నీటి పన్ను వసూళ్లలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. దీంతో రూ.17 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. రైతులు చెల్లించాల్సిన అసలు, వడ్డీ కలిపి పన్ను బకాయిలు భారీగా పెరిగాయి.

ప్రభుత్వం వ్యవసాయ భూములకు సాగునీటి పథకాల ద్వారా నీరు అందించినందుకు రైతుల నుంచి సంవత్సరానికి ఒకసారి నీటి తీరువా (వాటర్ ట్యాక్స్) వసూలు చేస్తుంది. మైనర్ ప్రాజెక్టుల కింద వ్యవసాయ భూములకు ఎకరాకి రూ.100లు, మేజర్ ప్రాజెక్టుల కింద భూములకు రూ.200 చొప్పున రైతులు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. ఒక ఏడాది నీటి పన్ను చెల్లించకపోతే రైతుపై 6 శాతం వడ్డీ పడుతుంది. ఏడాదికి ఒకసారి నీటి తీరువా చెల్లించడం రైతులకు పెద్ద కష్టం కాదు. కానీ అధికారులు ఏళ్ల తరబడి పన్ను అడగడం మానేశారు. పూర్వం వీఆర్‌వోలు వసూళ్లు చేసేవారు. గత మూడేళ్లగా సచివాయాలలో ఆన్‌లైన్‌లో చెల్లిస్తే రశీదు ఇస్తున్నారు. సంవత్సరం మొత్తం వసూలు చేసిన నీటి తీరువా నగదు మండల తహశీల్దార్లు కాడా (కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ) కమిషనర్ ఖాతాకి బదిలీ చేసి ప్రొసీడింగ్స్ పంపుతారు. జలవనరుల శాఖ అధికారులు సాగునీటి పథకాల మరమ్మతులు, అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టినప్పుడు తహశీల్దార్లు పంపిన ప్రొసీడింగ్స్ పత్రాలు జత చేస్తారు. 2007 నుంచి నీటి తీరువా వసూళ్లపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. దీని వలన సాగునీటి పథకాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు ఆగాల్సి వస్తుంది. దీని వలన పంట కాలువలు, ఆనకట్ట మరమ్మతులు చేపట్టడంతో జాప్యం జరుగుతుంది. పంట కాలువలో పూడిక తొలగించడం లేదు. దీని వలన సాగు నీరు చివరి ఆయకట్టు వరకు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. నర్సీపట్నం జల వనరుల శాఖ ఈఈ పరిధిలో నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల్లోని 12 మండలాలతో పాటు రోలుగుంట మండలం, రావికమతం మండలంలో కొంత భాగం ఉంది. జలవనరుల శాఖ డివిజన్‌లోని 137 మైనర్ ఇరిగేషన్ పథకాల పరిధిలో 83,715 ఎకరాల ఆయకట్టు ఉంది. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తాండవ ఒక్కటే ఉంది. ప్రాజెక్ట్ కమిటీ ఒకటి, డిస్ట్రిబ్యూషన్ కమిటీలు ఐదు, నీటి సంఘాలు 27 ఉన్నాయి. తాండవ పరిధిలో 53,415 ఎకరాల ఆయకట్టు ఉంది.

బకాయిలు ఎప్పటికప్పుడు వసూలు చేయాలి



నీటి పారుదల ప్రాజెక్టులు సమర్థంగా నడిపి, సాగునీరు అందించాలంటే నీటి పన్నులు వసూలు చేయాలి. ఆ మొత్తాన్ని ప్రాజెక్టు నిర్వహణకు ఖర్చు చేయగలుగుతాం. ఇప్పుడు గ్రీజు, ఇతర నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం మీద ఆధార పడాల్సి వస్తున్నది. నీటి తీరువా బకాయిలు ఎప్పటికప్పుడు వసూలు చేయాలి. కాలువల ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కరక సత్యనారాయణ, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్, నాతవరం

నీటి తీరువా బకాయిలు రూ.15 కోట్లు

నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో 3,53,872 ఎకరాలు వ్యవసాయ భూములకు సంబంధించి 2,01,493 ఖాతాలు ఉన్నారు. రైతుల నుంచి వసూలు చేయాల్సింది రూ.16,67,41,893లు ఉండగా, అక్టోబరు నెలాఖరుకి రూ.1,69,93,418లు మాత్రమే వసూలు ... మిగతా 6వ పేజీలో

మార్చి నెలాఖరుకల్లా.. బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేస్తాం

జిల్లా కోర్టుకు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల లిఖిత పూర్వక హామీ

» పనులకు అవసరమైన నిధులు మంజూరైనట్టు వెల్లడి

» జనవరి 29కి వాయిదా పడిన కేసు



కోర్టు విచారణకు హాజరై బయటకు వస్తున్న ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ సాంబశివరావులు శనివారం జిల్లా కోర్టుకు లిఖిత పూర్వక హామీ ఇచ్చారు. బీఎన్ రహదారి అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంపై స్థానిక న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, తదితరులు జిల్లా కోర్టులో దాఖలు చేసిన కేసుకు సంబంధించి శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్‌అండ్‌బీ చీఫ్ సెక్రటరీ తరఫున విచారణకు హాజరైన ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ఈ మేరకు జిల్లా జడ్జికి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇప్పటికే బీఎన్ రోడ్డుకు సంబంధించి ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో

హాకీ అకాడమీ మంజూరుకు కృషి

» ఇప్పటికే శాప్ చైర్మన్, క్రీడా మంత్రితో మాట్లాడా..

» హోం మంత్రి అనిత



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో ఎక్కడైనా 8 ఎకరాల స్థలం ఉంటే వెంటనే హాకీ అకాడమీని మంజూరు చేయిస్తానని, ఇప్పటికే శాప్ చైర్మన్, క్రీడా మంత్రితో మాట్లాడానని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం మధ్యాహ్నం నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ మైదానంలో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -19 హాకీ పోటీలకు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు వుంటుందన్నారు. బాల్యం నుంచి పిల్లలు మొబైల్ గేమ్స్‌కు అలవాటుపడకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. వారు మైదానంలో క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. నక్కపల్లికి హాకీని పరిచయం చేసి, ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసిన హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబును హోం మంత్రి అనిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, కూటమి నాయకులు తోట నగేశ్, ఏజెర్ల వినోద్‌రాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, కురందాసు నూకరాజు, చించలపు పద్దు, దేవర సత్యనారాయణ, అబద్దం, అల్లు నర్సింహమూర్తి, వెలగా శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
మండల కేంద్రమైన నక్కపల్లిలో శనివారం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-19 హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. హోం మంత్రి వంగలపూడి అనిత, హాకీ పోటీల రాష్ట్ర పరిశీలకుడు రవిరాజు, ఉమ్మడి విశాఖ జిల్లాల ఎస్‌జీఎఫ్ అధికారులు హాజరై రాష్ట్రస్థాయి హాకీ పోటీలను ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి సుమారు 800 హాకీ క్రీడాకారులు నక్కపల్లి వచ్చారు. హోం మంత్రి అనిత, అధికారులు ... మిగతా 6వ పేజీలో

అలజడి సృష్టించిన ఇద్దరి అరెస్టు

» 240 కిలోల గంజాయి స్వాధీనం

» మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ శ్రావణి, పోలీసులు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
పట్టణంలో శుక్రవారం సాయంత్రం పోలీసుల నుంచి తప్పించుకునేందుకు దూకుడుగా కారు నడిపి అలజడి సృష్టించిన రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శనివారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రం భిల్వారా జిల్లాకు చెందిన దినేశ్ చౌదరి, రాజాసమల్ జిల్లాకు చెందిన తులసీరామ్ బలాయ్‌లు 240 కిలోల గంజాయిని ఏజెన్సీ ప్రాంతం నుంచి రాజస్థాన్‌కు కారులో తీసుకు వెళుతున్నారన్నారు. స్థానిక సీఐ అప్పలరాజు, ఎస్ఐ నాగకార్తీక్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా. ఈ ఇద్దరూ దూకుడుగా కారు నడిపి వాహనదారులను ఢీకొట్టి పరారయ్యేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారని చెప్పారు. ఈ కారుతో పాటు అందులో ఉన్న 240 కిలోల గంజాయిని, సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ముఠాలో కీలకమైన అసిఫ్, రాజేశ్, రమేశ్ అనే మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాన్ని నియమించినట్టు చెప్పారు. పోలీసులను హతమార్చేందుకు ప్రయత్నించడంతో పాటు, వాహనదారులను ఢీకొట్టి చంపి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నిందితులపై ... మిగతా 6వ పేజీలో

పకడ్బందీగా రీ సర్వే

» భూమి ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలి

» అధికారులకు రీ సర్వే డిప్యూటీ డైరెక్టర్ కె.రమణమూర్తి ఆదేశం



రీ సర్వే రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కె.రమణమూర్తి

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్రంలో రెండో విడత జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రీ సర్వే డిప్యూటీ డైరెక్టర్ (అమరావతి) కె.రమణమూర్తి ఆదేశించారు. మండలంలోని ఆరిపాక గ్రామంలో శనివారం జరిగిన రీ సర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అదపురెడ్డి పైడినాయుడు అనే రైతుకు సంబంధించిన సర్వే కొలతలను మరోసారి ఆయన తీయించారు. సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వేకు ముందు అధికారులు సమాచారం ఇచ్చారా?, నోటీసులు ఇచ్చారా? అని అడగ్గా, సమాచారం ఇచ్చే సర్వే చేపట్టారని రైతులు సమాధానమిచ్చారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ప్రతి గ్రామానికి సరిపడా సమయం ఇస్తున్నందున, గతంలో వలే ఎటువంటి ఒత్తిడి లేనందున తప్పులు దొర్లకుండా రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. భూమి ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా రికార్డులు తీర్చిదిద్దాలన్నారు. కోర్టు పరిధిలో ... మిగతా 6వ పేజీలో

భారీఎత్తున విశాఖ ఉత్సవ్

భీమిలి, అరకు ఉత్సవ్‌లు కూడా...

» కనీసం ఐదు రోజులు, గరిష్ఠంగా వారం నిర్వహించేందుకు యోచన

» ప్రపంచ రికార్డు సాధించేలా ఏర్పాట్లు » భారీ క్రిస్మస్ ట్రీ ఏర్పాటు?

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):
విశాఖ ఉత్సవ్‌ను ఈసారి భారీఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఈ నెలాఖరున 29, 30 తేదీల్లో నిర్వహించాలని తలపెట్టిన భీమిలి ఉత్సవ్‌ను, జనవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహించాలనుకున్న అరకు ఉత్సవ్‌ను రద్దు చేసింది. ఇవన్నీ కలిపి ఒకేసారి దాదాపు వారం రోజులు ఘనంగా నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

గతంలో విశాఖ ఉత్సవ్‌తో పాటే భీమిలి, అరకు ఉత్సవ్‌లు నిర్వహించేవారు. వైసీపీ ప్రభుత్వం ఒకటి, రెండుసార్లు ఏ ఉత్సవ్‌కు ఆ ఉత్సవ్‌ను విడదీసి నిర్వహించింది. ఆ తరువాత వాటిని గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్వ పద్ధతిలో పర్యాటకాభివృద్ధికి ఈ ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించింది. ఈ ఏడాది ముందు భీమిలి ఉత్సవ్ నిర్వహించాలని పర్యాటక శాఖాధికారులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెండుసార్లు సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఇరవై రోజుల క్రితం అరకులోయలో సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవ్‌పై చర్చించారు. వీటికి అవసరమైన నిధుల కోసం పర్యాటక శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాయగా, విడివిడిగా వద్దని, అన్నీ కలిపి ఒకేసారి 'విశాఖ ఉత్సవ్' పేరుతో నిర్వహించాలని సూచించింది. గతంలో ఈ ఉత్సవాలు మూడు రోజులు మాత్రమే నిర్వహించేవారు. డిసెంబరు నెలలో క్రిస్మస్, ఆదివారం సెలవు కలిసి వచ్చేలా చూసుకొని తేదీలు ఖరారు చేసేవారు. భీమిలి ఎర్రమట్టి దిబ్బల్లో ట్రెజర్ హంట్, అరకులో బెలూన్ ఉత్సవ్, హెలీ టూరిజం వంటి ప్రత్యేక ఆకర్షణలతో మూడు రోజులు సంబరంగా ... మిగతా 6వ పేజీలో

టీచర్ జోత్స్నభాయి మృతి బాధాకరం

హోం మంత్రి అనిత



జోత్స్నభాయి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజానగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయురాలు జోత్స్నభాయి మృతి చెందడం పట్ల హోం మంత్రి వంగలపూడి అనిత సంతాపం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా తునిలోని ఉపాధ్యాయురాలు ఇంటికి శనివారం వెళ్లి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంచి ఉపాధ్యాయురాలును కోల్పోవడం అత్యంత బాధాకరమని వాపోయారు. పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు

సీహెచ్‌సీలో రక్తనిధి విభాగం ప్రారంభం



రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక సీహెచ్‌సీలో శనివారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతులు మీదుగా రక్తనిధి విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైవేను ఆనుకుని ఉన్న సీహెచ్‌సీలో అత్యవసర సేవల నిమిత్తం రక్తనిధి విభాగం అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదన్నారు. ఆస్పత్రి వైద్యురాలు నీహారిక, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ గుర్రాల శేఖర్, కూటమి నేతలు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, మోటారు గోపీ, కె.శ్రీను, యు.రమేశ్, అందే రమణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

'నాగులాపల్లి పీఏసీఎస్‌లో లావాదేవీలు భేష్'

మునగపాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులకు దీటుగా నాగులాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు ఏయూ ఎకనామిక్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఆశాలత పేర్కొన్నారు. మండలంలో ఈ పీఏసీఎస్‌ని విద్యార్థులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ యల్లపు వెంకటభాస్కరరావు, సీఈవో మళ్ల స్వామిడిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు తదితర అంశాలను వివరించారు. ప్రొఫెసర్లు డి.పవన్‌కుమార్, ఎ.వణికుమార్, తపస్వి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ రూ.10లక్షల విరాళం

మునగపాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు ఆడారి ఆదిబాబు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. గతంలో శ్రీసాంబమూర్తి దేవస్థానికి కూడా పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయను నిర్మాణ కమిటీ పెద్దలు బొడ్డేడ ప్రసాద్, బద్దెం సూర్యనారాయణ, పెంటకోట ఉమేశ్, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు తదితరులు ఘనంగా సత్కరించారు.

ఉపాధి జాబ్ కార్డులకు 102 దరఖాస్తులు

మునగపాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో శనివారం ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహించినట్టు ఏపీవో శివ తెలిపారు. కొత్తగా జాబ్ కార్డుల కోసం 102 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.మునగపాకలో గ్రామసభ సర్పంచ్ దిమ్మల అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురాం, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే ధ్యేయం కావాలి

- ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ, ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- ఏఎంసీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ ప్రతినిధులతో ప్రగడ, విజయ్‌కుమార్

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనమే ధ్యేయంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలవర్గం పనిచేయాలని ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో పాలకవర్గ ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండాలన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అచ్యుతాపురం, రాంబిల్లి కేంద్రాలుగా వేల కోట్లాది రూపాయల వ్యయంతో పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. నియోజవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్న ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీని అన్ని విధాలా అగ్రభాగాన నిలిపేందుకు పాలక వర్గ ప్రతినిధులు సమష్టిగా సేవలు అందించాలన్నారు. అనంతరం మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు పలు సూచనలందించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పి. లోవకుమారి, ఉపాధ్యక్షుడిగా గొర్లె బాబూరావు, సభ్యులుగా దర్మాల గోవిందరెడ్డి, జాగారపు చంద్రశేఖర్, సూరిశెట్టి అప్పలనాయుడు, బద్ది వెంకటరమణ, గరికిన గోవింద్, కంబాల బాస్కరరావు, కూనిశెట్టి రమణ, లాలం శాంతి, సరస్వతి, మాలతి, శ్రీను, సత్యనారాయణలతో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్పొరేషన్ల డైరక్టర్లు దూలి రంగనాయకుయలు, మామిడి శివ అప్పారావు, బి.శ్రీనివాసరావు, డొక్కా నాగబూషణం, నేతలు ఆడారి మంజు, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లాలం భరత్, పిట్టా శ్రీను, రాజాన సూర్య నాగేశ్వరరావు, కరణం రవి, పూటకూటి రమేశ్, కొఠారు శ్రీనులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడితో భేటీ



వెంకటేశ్వర్లను కలిసిన మండల వీఆర్‌ఓల సంఘం నేతలు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరులను మండల వీఆర్‌ఓల సంఘం నూతన అధ్యక్షుడు పలివెల వెంకటరావు, అనకాపల్లి డివిజన్ కార్యదర్శి శశిధర్‌లు శనివారం విశాఖ ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిజేస్తూ వీఆర్‌ఓల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛంతో ఆయనను సన్మానించారు.

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు విఘాతం



రాంబిలిలో నిరసన వ్యక్తంచేస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. శనివారం అచ్యుతాపురం జంక్షన్‌లో లేబర్‌కోడ్‌ల ప్రతిని తగులబెట్టారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను హరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, వురిటి చిన్న, కాకి రాజు, పి.చౌడప్పరావు, శ్యామ్, పి.ప్రసాద్, ఏ.రమణ, బాబునాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి: లేబర్ కోడ్ జీఓకు వ్యతిరేకంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు ఆధ్వర్యంలో శనివారం స్థానిక జగదాంబ జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. జీఓ ప్రతిని దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, ఎన్‌ఏటీబీ యూనియన్ నేత బద్ది భాస్కరరావు, ఆటో యూనియన్ నాయకులు భూపతి అప్పారావు, పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



ఎలమంచిలో సారే ఊరేగింపు చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెంలో శనివారం గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పిండి వంటలతో సారె ఊరేగింపు చేపట్టారు.

మునగపాక: మండలంలోని గవర్లఅనకాపల్లిలో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పొలమరశెట్టి ఆనందరావు, భాగేశ్వరరావు, కొయిలాడ వెంకట్, దొడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వద్దు: ఎమ్మెల్యే

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల భవన నిర్మాణ పనుల్లో జాగ్రత్తలు చర్యలు పాటించాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ సూచించారు.పాయకరావుపేట మండలం రాజానగరం స్కూలులో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుని మృతి చెందిన నేపథ్యంలో పట్టణంలోని తులసీనగర్ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి సిద్ధం చేసిన సామగ్రిని పరిశీలించారు. ఉపాధ్యాయులు, కూటమి నేతలు ఆడారి ఆదిమూర్తి, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, లాలం సోమునాయుడు,పూటకూటి రమేశ్, కొఠారు శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు వితరణ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవరాజం గ్రామానికి చెందిన కొంక భవానీ కుటుంబానికి గణేష్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గ్యాస్ స్టౌ, వంట పాత్రలు, నిత్యావసర సరకులను గ్రామ సర్పంచ్ వియ్యపు నానాజీ, పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఆనంద్, నర్సింగ్, కొల్లి వరహాలు, వెంకునాయుడు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతి చెందిన రంజిత్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, నేతలు

ఎలమంచిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పెదపల్లి వార్డులో టీడీపీకి చెందిన కుటుంబ సభ్యుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను శనివారం ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు స్థానిక టీడీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఆయన స్వ గృహంలో వి. రంజిత్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. అలాగే, గాయపడిన డి. గణేష్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, ఉపాధ్యక్షుడు దంట్ల స్వామి, మాజీ కోఆప్షన్ సభ్యుడు బొద్దపు నాగేశ్వరరావు, అనుసూరి కృష్ణలు పాల్గొన్నారు.

యలమంచిలి

ఏఎంసీ డైరెక్టర్‌గా రమణ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కూనిశెట్టి రమణకు యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి లభించింది. శనివారం యలమంచిలిలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో రమణను రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, పలువురు నాయకులు అభినందించారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



కొండబాబు (ఫైల్)

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెంలో విద్యుదాఘాతంతో మురముళ్ల కొండబాబు (27) మృతి చెందారు. వివరాలివి.. పెయింటర్‌గా పనిచేస్తున్న కొండబాబు శనివారం ఉదయం గ్రామంలో జామి వెంకటరమణ అనే వ్యక్తి ఇంటికి సున్నం వేయడానికి వెళ్లారు. ఇంటి వెలుపల సున్నం వేస్తుండగా భవనాన్ని ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి షాక్ గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామంలో టిఫిన్ షాపు నడుతూ జీవనాన్ని సాగించే మురమళ్ల సన్యాసిరావుకు కొండబాబు, సాయికుమార్ ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడైన కొండబాబు అర్ధాంతరంగా మృ త్యువాత పడడంతో తల్లితండ్రులు రోదిస్తున్నారు. తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖరరావు తెలిపారు.

చెరువుల్లో ఆక్రమణల తొలగింపు

ఎస్.రాయవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్రివానిపాలెం రెవెన్యూ పరిధిలో పాత చెరువు ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె.రమేశ్ మాట్లాడుతూ కర్రివానిపాలెం రెవెన్యూ పరిధిలో లింగరాజుపాలెం సరిహద్దుగా సర్వే నం.159లో ఉన్న పాత చెరువు ఆక్రమణకు గురైన 52 సెంట్ల భూమిని కాపాడాలని ఫిర్యాదు అందడంతో ఇరిగేషన్, పీఆర్ అధికారుల సమక్షంలో ఆక్రమణ గుర్తించామన్నారు. నోటీసులు జారీచేసినా ఆక్రమణదారులు స్పందించకపోవడంతో చెరువు గర్భం భూమిని శనివారం జేసీబీతో చదునుచేసి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ భూమిలో ఉన్న 59 కొబ్బరి చెట్లను ఇరిగేషన్ ఏఈ భాను ఆధ్వర్యంలో సర్పంచ్‌కు అప్పగించినట్టు ఆయన చెప్పారు.

అర్హులందరికీ ఉపాధి జాబ్ కార్డు ఉండాలి

కోటవురట్ల, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ఉపాధిలో పనులు పొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు కలిగి ఉండాలని ఏపీవో నాగరాజు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శనివారం ఈకేవైసీ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో అక్రమాల నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈకేవైసీ ప్రవేశపెట్టింది. పలు కారణాల వల్ల కొంత మంది కార్డు తొలగించామని, వారిలో అర్హుల జాబ్‌కార్డులు పోతే తిరిగి పొందేందుకు తమను సంప్రదించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పక్కా గృహాలు మంజూరుచేస్తున్న కారణంగా కొత్త వారు జాబ్‌కార్డులు నమోదు చేయించుకోవాలని ఏపీవో తెలిపారు.

భూ సమస్యల ఫిర్యాదులపై విచారణ

కోటవురట్ల, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): భూమి వివాదాలకు సంబంధించి పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండల స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. తహశీల్దార్ తిరుమలబాబు అధ్యక్షతన పలు శాఖ అధికారులు, పోలీసుల సమక్షంలో విచారణ నిర్వహించారు. కొడవటిపూడి, కైలాసపట్నం, టి.జగ్గంపేట, సుంకపూర్ గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై ఇరు వర్గాలు వాదోపవాదాలను అధికారులు విన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. తహశీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ రమేశ్, ఎస్‌ఐ రమేశ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అభ్యాసన ఫలితాలపై దృష్టిసారించాలి

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులంతా అభ్యాసన ఫలితాలను విద్యార్థుల నుంచి రాబట్టేలా ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈవో కె.నరేశ్ సూచించారు. నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం పాఠశాలల సహాయకులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వచ్చే నెల 5 నుంచి వంద రోజుల ప్రణాళికలు అమలవుతాయన్నారు. ఎంఈవో-2 నాగన్నదొర, హెచ్ఎంలు విజయ, వి.నూకరాజు, జయశ్రీ, రిసోర్స్‌పర్సన్లు ఆచార్యులు, టీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన

ఎస్.రాయవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి పుల్లలవీధిలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ పుల్లల వీధిలో కుళాయిలువేసి ఏడాది కావస్తున్నా తాగునీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సిహెచ్.రమణమ్మ, జి.పైడమ్మ, జి.సత్యవతి, కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలకు చేరువగా ఉండండి

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు పార్టీ నాయకులు చేరువగా వుండాలని, ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శనివారం సాయంత్రం స్థానికంగా వున్న క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం సమన్వయకమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరుగుతాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అలాగే ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకుల నుంచి అభిప్రాయాలు మంత్రి సేకరించారు.

పెదిరెడ్డిని సత్కరించిన మంత్రి

కష్టపడ్డ వారిని గుర్తించే పార్టీ తెలుగుదేశమని, టీడీపీకి పునాది ,బలం పార్టీ కార్యకర్తలేనని మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పెదిరెడ్డి చిట్టిబాబును హోం మంత్రి అనిత, పలువురు టీడీపీ నాయకులు సత్కరించారు. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. బడుగు,బలహీన వర్గాలు, రైతులు, కర్షక, కార్మికుల సంక్షేమం, మహిళల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తోందని చెప్పారు. తనకు అవకాశం కల్పించినందుకు చిట్టిబాబు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గకన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మండల అధ్యక్షుడు చించలపు పద్దు, టీడీపీ నాయకులు అల్లు నరసింహమూర్తి, వెలగా శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షాలో అక్రమాలెన్నో!

... 5వ పేజీ తరువాయి

కంప్యూటర్స్ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అయితే ఎటువంటి అర్హతలు లేకపోయినా ఒక ఉపాధ్యాయుడ్ని ఏఎస్‌వోగా నియమించారు. అసిస్టెంట్ స్టాటస్టికల్ అధికారి పోస్టుకు జిల్లాకు చెందిన 9 మంది దరఖాస్తులు చేసుకోగా, ఎవరికీ అవకాశం ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధం గా ఏఎస్ఆర్ జిల్లా నుంచి ఒక ఉపాధ్యాయుడ్ని ఏఎస్‌వోగా నియమించారు. ఇవే కాకుండా మొత్తం ఏడు పోస్టులను అధికారి తనకు అనుకూలమైన ఉపాధ్యాయులను ఎటువంటి విద్యార్హతలు లేకుండానే నియమించినట్టు తెలిసింది. ఇప్పటికే సమగ్ర శిక్షా విభాగంలో అక్రమ డిప్యూటేషన్‌ల వ్యవహారంలో విచారణ నివేదిక ఆధారంగా ఏపీసీ జయప్రకాశ్‌కు షోకాజ్ నోటీసు జారీచేసి, మాతృ సంస్థ అయిన కళాశాలకు అధ్యాపకుడిగా పంపారు. ఆయన స్థానంలో కొత్తగా ఒక మహిళా అధికారిని నియమించారు. అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న మరికొందరిపై త్వరలో చర్యలు తప్పవని అంటున్నారు. సమగ్ర శిక్షాలో అడ్డగోలుగా సాగిన డిప్యూటేషన్ల వ్యవహారంలో మరికొందరిని విచారించేందుకు అధికారులు సిద్ధమవుతుండడంతో విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మార్చి నెలాఖరుకు బీఎన్ రోడ్డు పూర్తిచేస్తాం

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టరుకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించడంతో పాటు, రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కూడా విడుదల చేసిందని జడ్జికి వివరించారు. కాంట్రాక్టరు కూడా బీ ఎన్ రోడ్డు పనులు ప్రారంభించారని, ఈ పనులు మార్చి నెలాఖరుకల్లా పూర్తవుతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాది డేవిడ్ బీఎన్ రోడ్డులో దెబ్బతిన్న విజయరామరాజుపేట, వడ్డాది వంతెనల నిర్మాణం గురించి జిల్లా జడ్జి దృష్టికి తీసుకుని వెళ్లగా, విజయరామరాజుపేట వంతెన కూడా మార్చిలోగా పూర్తి చేస్తామని, వడ్డాదిలో వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి రూ.26 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ఆ నిధులు మంజూరైతే వడ్డాది వంతెన నిర్మాణం చేపడతామని వివరించారు. ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల వాదనలు లిఖిత పూర్వక హామీని పరిగణలోనికి తీసుకున్న 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ కేసును జనవరి 29కి వాయిదా వేశారు.

రోడ్డు పనుల పురోగతిని బట్టి న్యాయపోరాటం

బీఎన్ రోడ్డు పనులు మార్చిలోగా పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు లిఖిత పూర్వక హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ తెలిపారు. పనుల పురోగతిని పరిశీలిస్తామని, పనుల్లో మళ్లీ జాప్యం జరిగితే న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

భారీఎత్తున విశాఖ ఉత్సవ్

... 5వ పేజీ తరువాయి

చేసేవారు. ఈసారి అంతకు మించి నిర్వహించాలని, కనీసం ఐదు రోజులు, గరిష్ఠంగా వారం రోజులు ఉత్సవ్ ఉండాలని ప్రభుత్వ పెద్దలు సూచించినట్టు సమాచారం. యోగాంధ్ర మాదిరిగా భారీఎత్తున నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పే ఆలోచనలో ఉన్నారు. ఇందులో భాగంగా భారీ అలంకరణలతో 'క్రిస్మస్ ట్రీ' పెడతారని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఏ ఉత్సవమైనా నిధులు చాలా ముఖ్యం. పర్యాటక శాఖకు ఇదే పెద్దలోటు. వీటిని ఎలా సమకూరుస్తారనే దానిపై కూడా చర్చలు జరుగుతున్నాయి. వీటిపై రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉంది.

మాడుగుల సబ్ రిజిస్ట్రార్‌గా సంజీవయ్య

... 5వ పేజీ తరువాయి

ఉంది. ఆ తరువాత ఆయన విజయవాడలోని ఐజీ కార్యాలయానికి వెళ్లిపోయారు. వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్ శాఖకు ఐజీగా ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఆయన దగ్గర చేరి, ఎక్కడెక్కడి నుంచి ఎలా వసూళ్లు చేయవచ్చునో వివరించి, ఆ బాటలోకి మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో ఐజీ కార్యాలయానికి అవసరమైన ఫర్నీచర్ కోసం సంజీవయ్య విశాఖపట్నం నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేసింది. ఆ ఐజీ వెనక్కి వెళ్లిపోయారు. మరో ఐజీ వచ్చారు. అప్పుడు కూడా సంజీవయ్య కొన్నాళ్లు తన హవా నడిపించారు. స్వామి కార్యం, స్వకార్యం పూర్తి చేసుకుంటున్నారని తెలిసి పక్కనపెట్టారు. కొద్ది నెలల క్రితం కొత్త ఐజీ బాధ్యతలు తీసుకున్నారు. సంజీవయ్యతో జాగ్రత్తగా ఉండాలని కొందరు సూచించడంతో దూరం పెట్టారు. రెండు రోజుల క్రితం అక్కడి నుంచి మాడుగుల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లాలో మాడుగుల పెద్దగా ఆదాయం ఉండని ప్రాంతం. అక్కడ పనిచేసే సబ్ రిజిస్ట్రార్ మొన్న జూన్‌లో పదవీ విరమణ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌తోనే నడిపిస్తున్నారు. ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో సంజీవయ్యను నియమించారు. సోమవారం బాధ్యతలు చేపడతారని తెలిసింది. ఇటీవల విశాఖలో డీఐజీ కార్యాలయానికి వచ్చి మాడుగుల కాకుండా మరేదైనా పోస్టింగ్ కోసం యత్నించి విఫలమైనట్టు సమాచారం.

ఇదేం తీరువా?

... 5వ పేజీ తరువాయి

అయింది. ఇంకా రూ.15 కోట్లు బకాయిలు వసూలు కావలసి ఉంది.

నీటి పన్ను బకాయిలు వసూలు చేయాల్సిందే...

గత నెలలో అనకాపల్లిలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆధ్వర్యంలో సాగునీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, ఇరిగేషన్ ఎస్ఈ, డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కొంత మంది నీటి సంఘాల అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల నుంచి నీటి తీరువా బకాయిల వసూళ్లపై చర్చించారు. జిల్లాలో సాగునీటి పథకాల నిర్వహణ అధ్వానంగా ఉందని తెలిపారు. సాగునీటి పథకాల మరమ్మతులు, కాలువలో పూడిక సమస్యలు ఉన్నాయని ప్రాజెక్ట్ చైర్మన్లు సమస్యను లేవనెత్తారు. నీటి తీరువాల బకాయిలు వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. పంట కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

త్రివర్ణపతాకాన్ని, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హోం మంత్రి అనితకు హాకీ క్రీడాకారులు ఘనంగా క్రీడా స్వాగతం పలికారు. ముందుగా హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి హోం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. విశాఖ డీవీఈవో పి.ఉమారాణి, డీఐఈవో వినోద్‌రాజు, ఆర్ఐవో మురళి, డీఎస్‌డీవో పూజారి శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీపీ పుష్పలత, హాకీ క్లబ్ ప్రతినిధులు సూరిబాబు, చిన్న అప్పారావు, రామచంద్రరావు, తాతాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా తొలిరోజు పోటీలు

తొలిరోజు నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ మైదానంలో జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలుర విభాగంలో ప్రకాశం జట్టుపై కడప, విజయనగరంపై గుంటూరు, కృష్ణా జిల్లా జట్టుపై నెల్లూరు, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి, గుంటూరుపై అనంతపురం, పశ్చిమ గోదావరి జట్టుపై చిత్తూరు, కృష్ణా జిల్లా జట్టుపై విశాఖ జట్లు విజయం సాధించాయి.

బాలికల విభాగంలో విజయనగరం జట్టుపై ప్రకాశం, నెల్లూరుపై కడప, పశ్చిమగోదావరిపై విశాఖ, పశ్చిమ గోదావరి జట్టుపై తూర్పు గోదావరి జిల్లా జట్లు విజయం సాధించాయి.

అలజడి సృష్టించిన ఇద్దరి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

హత్యాయత్నం సెక్షన్‌తో పాటు, ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. వీరిని జడ్జి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని ఆమె తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీసులను ఆమె అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ అప్పలరాజు, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ నాగకార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

... 5వ పేజీ తరువాయి

ఉన్నవి వదిలిపెట్టి, కోర్టు పరిధిలో లేని వివాదాలకు సంబంధించి ఇరువర్గాలతో మాట్లాడి సాధ్యమైనంత వరకూ పరిష్కరించాలని సూచించారు. మండల, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సర్వే ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి ఎస్. గోపాలరాజు, జిల్లా ల్యాండ్ సర్వే ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకన్న, తహశీల్దార్ బి. చిన్నికృష్ణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, మండల ఆర్ఐ వీరయ్య, సర్వేయర్లు లోకేశ్, వీఆర్వో అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో
పీలా వారి గౌరీ పరమేశ్వరుల అనుపు

- నేత్రపర్వంగా సాగిన ఉత్సవం
- ఆకట్టుకున్న నేలవేషాలు
- పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు


ప్రత్యేక వాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోటవీధిలో పీలా వారి గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి ఏడుగంటల సమయంలో ఈ వేడుక ప్రారంభమైంది. తొలుత నిర్వాహకులు ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. ఇందులో కోబ్రా డ్యాన్స్, పులివేషాలు, కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. గవరపాలెం గౌరమ్మ అనుపు మహోత్సవానికి ఎంతో పేరు ఉంటుందో పీలావారి గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవానికి కూడా అంతే పేరు ఉంటుంది. అందుకనే భక్తులు దారి పొడువున వేచి ఉండి ఆది దంపతులను దర్శించుకుంటారు. అదేవిధంగా ఈ శనివారం కూడా ఎక్కడ చూసినా ఇదే కోలాహలం కనిపించింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నివాసం వద్ద గల ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల గుండా మెయిన్‌రోడ్డు మీదుగా సాగింది. అనంతరం శారదా నదిలో ఉత్సవమూర్తులను నిమజ్జనం చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు కొణతాల రఘునాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్ష, కార్యదర్శులు భీమరశెట్టి మహాలక్ష్మీనాయుడు, బుద్ద శివ, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, వీధి పెద్దలు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఉదయం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


ఊరేగింపులో కోబ్రా డాన్స్ చేస్తున్న కళాకారులు

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో


టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో

కశింకోట, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరి షత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రత్యేక బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పదోన్నతుల కోసం వినతి

కొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అనకాపల్లి రింగురోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి తగిన సూచనలు చేస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ వద్ద ఫొటో ఎగ్జిబిషన్ షో

తుమ్మపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద వరల్డ్ హెరిటేజ్ వీక్‌లో భాగంగా శనివారం ఫొటో ఎగ్జిబిషన్ షో నిర్వహించారు. వందేమాతరం కాన్సెప్ట్‌తో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరై ఆసక్తిగా తిలకించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఈజీ రైటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జన్నకొండ ప్రతినిధులు పీలా మహాద్రై, నాగరాజు పాల్గొన్నారు.

సోమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణం


సోమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాలతిరుగుడు స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం నూతన కమిటీ సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్ డీఆర్‌వీ సత్యనారాయణ, సభ్యులు దాడి శివ సత్యనారాయణ, రాపేటి శ్రీను, నాగిరెడ్డి సన్యాసినాయుడు, వి.సీతారామ మూర్తి, జి.నారాయణమ్మ, ఇరోతి భవానీ, పి.పార్వతి, వి.పాపమ్మలతో ఆలయ ఈవో మురళీ, ఇన్‌స్పెక్టర్ వసంత్‌కుమార్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, ఆడారి నాగరాజు, దొడ్డి రామునాయుడు, దాడి సూరిబాబు, ఎస్.సత్యనారాయణ, అర్చకులు డి.శేఖర్, పతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'నానో యూరియాతో బహుళ ప్రయోజనాలు'

పరవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియాను రైతులు వినియోగించుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయశాఖ అనకాపల్లి డివిజన్ సహాయ సంచాలకుడు సీహెచ్.సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద నానో యూరియాపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎకరా వరిపైరుపై 500 ఎంఎల్ చొప్పున నానో యూరియా స్ప్రే చేసుకోవడం వల్ల వరిపైరు పచ్చగా ఉంటుందన్నారు. అలాగే, ఏపుగా పెరుగుతుందని వివరించారు. 500 ఎంఎల్ సామర్థ్యం కలిగిన నానో యూరియా ఖరీదు రూ. 225లు ధర ఉంటుందన్నారు. ఏవో ఎం.రమాదేవి మాట్లాడుతూ నానో యూరియా వినియోగించుకోవడం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాలు కలుగుతాయో వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి మూర్తి, రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

పీఏసీఎస్‌ల ద్వారా మరిన్ని సేవలు

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ
- కూటమి ప్రభుత్వంలో రైతులకు ప్రత్యేక గుర్తింపు : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

కశింకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శనివారం జరిగిన నర్సింగబిల్లి పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రైతులు యాంత్రీకరణ దిశగా అడుగులు వేయాలన్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గించుకొని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతాంగానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం సీట్లు కూటమి ప్రభుత్వం గెలుచుకోవాలని కొణతాల, పీలా పిలుపునిచ్చారు. అనంతరం నర్సింగబిల్లి ప్రాథమిక పరపతి సంఘం చైర్మన్‌గా నియామకమైన మజ్జి నిరంజన్‌కుమార్, డైరెక్టర్లు గిరిబాబు, నానిబాబులతో ప్రమాణం చేయించారు. చైర్మన్ నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ పీఏసీఎస్‌ను మరింత అభివృద్ధి పథకంలో నడిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గొంతిన శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, కశింకోట పీఏసీఎస్ చైర్మన్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- 'మన పల్లెకు- మన ఎమ్మెల్యే'లో పంచకర్ల రమేశ్‌బాబు


ఎల్లుప్పిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. మండలంలోని బోదివలస, ఎల్లుప్పి గ్రామాల్లో శనివారం 'మన పల్లెకు- మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైన్లు ఏర్పాటు చేయాలని, స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని పలువురు వినతి పత్రాలు అందజేశారు. ఎల్లుప్పి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, శ్మశాన వాటికలో షెడ్డు, కమ్యూనిటీ భవనం, పంచాయతీ భవనం మరమ్మతు చేపట్టాలని తాగునీటి పథకానికి నిధులు మంజూరు చేయాలని పలువురు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలన్నింటినీ పరిశీలించి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రాధాన్యత క్రమంలో రానున్న మూడున్నరేళ్లలో వ్యక్తిగత సమస్యలతో పాటు, గ్రామ సమస్యలన్నీ పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, కూటమి నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు, కంచిపాటి రాంబాబు, గంతకోరు సూర్యనారాయణ, ఉగ్గిన రాము, ఎల్లాజీరావు, అమరపిన్ని నర్సింగరావు, ఇందలి రమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బీపీ రావు, ఎం.మహాలక్ష్మీనాయుడు, రోమాల చంద్రశేఖర్, బి.కనకరాజు, టి.శేఖర్, కేవీ రమణ, సత్యనారాయణ, గొర్లి కుమార్, సింగంపల్లి శ్రీను, బి.పద్మలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం
- పోలీసు కుటుంబాల సంక్షేమమే ధ్యేయమని స్పష్టీకరణ


పోలీసు కుటుంబాల వారికి చెక్కుల పంపిణీలో పాల్గొన్న తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కుటుంబాల సంక్షేమమే తన ధ్యేయమని ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాలపై శనివారం ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. బాధిత కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గ్రాడ్యుటీ, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, జీఐఎస్, డెత్ బెనిఫిట్స్ వంటి ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. అలాగే, కారుణ్య నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణలో మరణించిన ఆరుగురు పోలీసుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, ఎల్. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి


సబ్‌జైలు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ధర్మారావు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలపై ఆరా తీశారు. నిందితులతో మాట్లాడి పరిస్థితులు తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైతే వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ కిరణ్, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధులు సత్యనారాయణ, సంధ్య, న్యాయ సహాయకులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

స్నానానికి దిగి కెరటాల తాకిడికి కొట్టుకుపోయిన వైనం


గల్లంతైన శ్రీఆదిత్య, తేజస్ (ఫైల్)

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు విద్యార్థులు కెరటాల తాకిడికి గల్లంతవ్వగా, మరో ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం నగరంలోని వుడా పార్కు వెనుక బీచ్‌లో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బుల్లయ్య కళాశాలలో డిగ్రీ మైక్రో బయాలజీ మూడో సంవత్సరం చదువుతున్న నరేంద్రపురపు శ్రీఆదిత్య (20), మానేపల్లి తేజస్ (20), మరో ఆరుగురితో కలిసి శనివారం సాయంత్రం వుడా పార్కు వెనుక ఉన్న బీచ్ లైట్‌హౌస్ వద్దకు వెళ్లారు. కాసేపు బీచ్‌లో సరదాగా గడిపారు. శ్రీఆదిత్య, తేజస్‌లతో పాటు మరో ఇద్దరు సముద్ర స్నానానికి దిగారు. నలుగురు స్నానం చేస్తుండగా అలల తాకిడికి లోపలకు కొట్టుకుపోయారు. వారిలో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. శ్రీఆదిత్య, తేజస్‌లు అలల్లో చిక్కుకుని గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. రాత్రి 11 గంటలకు కూడా ఆచూకీ లభించలేదు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ అర్జున్ తెలిపిన వివరాలివి. ఇక్కడి జాతీయ రహదారిలోని పూడిమడకకు వెళ్లే జంక్షన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి సుమారు నలభై సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఉన్నాడు. ఇంతలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు అతనిని ఢీకొని వెళ్లిపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నక్కపల్లి టోల్‌గేటు వద్ద బస్సును అదుపులోకి తీసుకున్నారు. మృతుడు 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయ, నీలం తెలుపు ఉంటాడన్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలి : ఆర్జేడీ

సబ్బవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించినప్పుడే పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని పాఠశాల విద్యాశాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు డి. విజయభాస్కర్ అన్నారు. శనివారం సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలోనే వారి అలవాట్లు, తోటివారితో వ్యవహరించే తీరు, చదువుపట్ల శ్రద్ధ వంటి అంశాలను గమనించాలన్నారు. ఒకవేళ తేడా ఉంటే తల్లిదండ్రులకు చెప్పాలని, అప్పుడు ప్రభుత్వ పాఠశాలల పట్ల వారిలో నమ్మకం, విశ్వాసం పెరుగుతుందన్నారు. పాఠాలు బోధనే కాకుండా ప్రతి రోజు విద్యార్థులతో నోట్స్‌లు రాయించి వాటిలో తప్పు ఒప్పులు దిద్దాలన్నారు. చదవడం కంటే రాస్తేనే విద్యార్థికి పాఠాలు గుర్తుంటాయని వివరించారు. దిద్దిన నోట్‌పుస్తకాలను తల్లిదండ్రులకు చూపించమని విద్యార్థులకు చెప్పాలని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్ఠమైన విద్యాబోధన ఉంటుదని వారికి నమ్మకం కలుగుతుందన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు కనీసం 50 పేజీల నోట్స్ రాయని సందర్భాలూ ఉన్నాయని అన్నారు. ఏడాది చివర రెండు నెలల్లో టీచర్లు ఎక్కువ సెలవులు పెడుతుంటారని అన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడి మధ్య సమన్వయం ఉండాలని కోరారు. స్కూలు కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాశాఖధికాకారులు, ప్రధానోపాధ్యాయుడు, 90 మంది స్కూలు అసిస్టెంట్లు, 40 మంది ఎస్జీటీలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్ రద్దుకు నిరసన

పరవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఫార్మాసిటీలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు టి.మల్లేశ్వరరావు, కరణం వెంకటరావు, దేవకిశోర్, వెంకటస్వామి, లక్ష్మణరావు, రాము, ఈశ్వరరావు, రమేష్, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జడ్సీపై చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది ఆందోళన


జోనల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు,

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు శనివారం సాయంత్రం ఇక్కడి జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తొమ్మిదవ సచివాలయం వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఎం.నూకరాజు ఈ నెల 20వ తేదీన తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగానే చనిపోయాడని వారు వాపోయారు. జోనల్ కమిషనర్ చక్రవర్తి నూకరాజుకు సెలవు మంజూరు చేయకపోవడం, విపరీతమైన పనిఒత్తిడి వంటి కారణాల వల్ల మానసిక ఒత్తిడికి గురై మృతి చెందాడని సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మహిళా ఉద్యోగులను కూడా అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే జోనల్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగించి, మృతుడు నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.

పుష్పాలంకరణలో గోవిందుడు



కశింకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వేంకటేశ్వర ధ్యానమందిరంలో స్వామి వారు శనివారం ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. వేకువజామున అర్చకులు రేజేటి చరణ్ విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నేత్రపర్వంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

తుమ్మపాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి శోభాయాత్రను వేల్పుల వీధిలో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప పీఠం వద్ద నుంచి మాలధరించిన భక్తులు స్వామిని పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గురుస్వామి బుదిరెడ్డి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకాడ నరసింగరావు, ముత్తా శ్రీనివాసరావు, నల్లల శ్రీనివాసరావు, వాకాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా అధికారుల వనభోజన కార్యక్రమం

కశింకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శారదావనంలో జిల్లా అధికారుల వనభోజన కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. మధ్యాహ్నం విచ్చేసినవారు వనభోజనాల అనంతరం సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.

పాడి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

పరవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హెరిటేజ్ డెయిరీ సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేష కోరారు. తానాం గ్రామంలో పాడి రైతులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పాడి సంపద సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డెయిరీ కల్పిస్తున్న పథకాలను వివరించారు. అనంతరం పశువైద్య శిబిరం నిర్వహించారు. హెరిటేజ్ డెయిరీ డాక్టర్ పి.శ్యామ్‌సుందర్, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్.రాము, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు డ్వాక్రా మహిళలు కృషి చేయాలి

పరవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు అన్నారు. శనివారం ఇక్కడ డ్వాక్రా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు పరిసరాల పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామాల పరిశుభ్రతకు డ్వాక్రా మహిళలు తమవంతు కృషి చేయాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా క్లాప్ మిత్రలు సేకరించే విధంగా చూడాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అచ్యుతరావు, వెలుగు ఏపీఎం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి

» జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్



అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, హెచ్‌ఐవీపై జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా లెపర్సీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్. ఎం.కిరణ్ కుమార్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లల అవసరాలపై శనివారం స్థానిక పీఎంఆర్సీ భవనంలో వివిధ శాఖల సిబ్బంది, బాధిత చిన్నారులు, వారి కుటుంబ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లల అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లలు ఏఆర్‌టీ మందులతోపాటు పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకుంటూ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు.

వివిధ మండలాల్లో హెచ్‌ఐవీ ప్రభావితమైన 14 నుంచి 25 ఏళ్ల వయస్సు గల వారి సమస్యలు, అవసరాలు గుర్తింపు, పరిష్కారానికి అవసరమైన చ ర్యలపై జిల్లా స్థాయి శాఖాధికారులు, ఎస్‌వీడీఎస్ స్వయ్యంద సేవా సంస్థ, నెట్ వర్క్ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి ద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.బాలకృష్ణ, పాఠశాల విద్యా కమిషనర్ (పరీక్షలు) శశికుమార్, ఉన్నత విద్య నోడల్ ఆఫీసర్ గౌరీశంకర్, జిల్లా డిప్యూటీ డెమో పి.సింహాచలం, జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, సీడీపీవో శారద దేవి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రామచందర్, డీఎండీవోఎస్ చిరంజీవి పాల్గొన్నారు.

స్టడీ అవర్ తప్పనిసరి



విద్యార్థినితో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో

జి.మాడుగుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పాఠశాలలో స్టడీఅవర్ తప్పని సరిగా ఉండాలని ఏటీడబ్ల్యూవో వి. నాగశిరిష అన్నారు. శనివారం రాత్రి ఆమె స్థానిక గాంధీనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం పెట్టాలని నిర్వహకులను ఆదేశించారు. రాత్రి వేళల్లో సిబ్బంది వసతి గృహంలో బస చేయాలన్నారు. గ్రూపుల వారీగా విభజించి చదివించాలని కోరారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు సీలేరు జడ్పీహెచ్ స్కూల్ పీడీ ఎంపిక



పీడీ చిన్న

సీలేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ చిన్ని ఎం పికయ్యారు. ఈ నెల 21 న విజయవాడలో జరిగిన సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థా యి పోటీల్లో చిన్ని ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆంధ్ర జట్టు తరఫున ఎంపిక చేశారు. త్వరలో న్యూఢిల్లీలో జరగనున్న ఖోఖో పో టీల్లో పాల్గొనున్నారు. సీలేరు పాఠశాలలో ఇటీవల పీడీగా చేరిన చిన్ని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు



దొన్నుదొరకు వినతి పత్రం అందిస్తున్న రంగశీల టీడీపీ నేతలు

హుకుంపేట నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో రంగశీల పంచాయతీలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ నియమించాలని కోరుతూ, విజయగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొరకు శనివారం టీడీపీ గ్రామ అధ్యక్షులు ఎ. భాస్కరరావు, పెసా కమిటీ కార్యదర్శి మత్స్యరాజు కోరారు. ఈ మేరకు అరకులో శనివారం నిర్వహించి స్పందన కార్యక్రమంలో దొన్నుదొరకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగశీల సచివాలయంలో గత్తున్ సచివాలయం సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నారన్నారు. దీంతో సచివాలయ పరిధిలో ఉన్న పలు సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రంగశీలలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించేలా చూడాలని కోరారు.

'కూటమి పాలనలో అర్హులందరికీ పక్కా గృహాలు'



మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు పూర్ణచంద్రరావు

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించినట్టు టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణ చంద్రరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీటవేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 33వేల పీఎం జన్‌మన్ పక్కా గృహాలను పీవీటీజీలకు మంజూరు చేసినట్టు తెలిపారు. తాజాగా గిరిజనుల్లో ఇతర తెగలకు సైతం పక్కా గృహాలు మంజూరుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హులు హౌసింగ్‌శాఖకు దరఖాస్తు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అందజేస్తోందన్నారు. గిరిజన గ్రామాల్లో రూ.కోట్ల నిధులతో బీటీ, గ్రావెల్ రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. చింతపల్లి మండలాల్లో రూ. 100కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నట్టు వివరించారు. గిరిజనులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు పాల్గొన్నారు.

ఎఫ్‌బీవో కుటుంబానికి రూ. 5 లక్షలు పరిహారం: డీఎఫ్‌వో



మృతుడు భార్యకు చెక్‌ను అందజేస్తున్న డీఎఫ్‌వో వైపీ నరసింహరావు

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో మృతి చెందిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందించినట్టు స్థానిక డివిజనల్ ఫారెస్టు అధికారి వైపీ నరిసింహరావు తెలిపారు. శనివారం మృతుని భార్య బొండ లక్ష్మీకి నగదు చెక్‌ని అందజేశారు. ఈసందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ గత ఏడాది సీలేరు అటవీశాఖ రేంజ్ పరిధిలో కొండజర్త బీట్‌లో ఎఫ్‌బీవోగా పనిచేస్తున్న బి. తిరుపతిరావు మృతి చెందారన్నారు. మృతుడు కుటుంబానికి ప్రభుత్వం సంజీవని పథకం ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి ఎస్. వెంకటరావు, మర్రిపాకలు ఇన్‌చార్జి రేంజ్ అధికారి సీహెచ్. సింహాచలం పడాల్ పాల్గొన్నారు.

జలాశయ నీటి మట్టం తెలుసుకునేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్

» సీలేరులో పరికరాల ఏర్పాటుకు పరిశీలన



సీలేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న జల వనరుల శాఖ, జెన్‌కో అధికారులు

సీలేరు, నవంబరు 22 , (ఆంధ్రజ్యోతి) : ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు పరిధిలోని గుంటవాడ జలాశయం (సీలేరు జలాశయం) నీటి నిల్వలు రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నేరుగా సమాచారం చేరేందుకు అవసరమైన పరికాల ఏర్పాటుకు జలవనరుల శాఖ బృందం శనివారం సీలేరులో పర్యటించింది. ఈ మేరకు ఈ బృందం స్థానిక జెన్‌కో అధికారులతో కలసి జలాశయం రెగ్యులేటర్ డ్యామ్, మెయిన్ డ్యామ్, ఇంటెక్ డ్యామ్‌లను పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన రియల్ టైమ్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేస్తూ సీలేరు జలాశయంలో నీటి మట్టాలు ప్రతి గంటకూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల వారు తెలుసుకునేందుకు వీలుగా ఈ పరికరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనిని ఎక్కడ అమర్చాలనే అంశంపై జలవనరుల శాఖ ఏపీ జెన్‌కో అధికారులు కలసి విస్తృతంగా పరిశీలించారు. గతంలో జలాశయ నీటి నిల్వలను స్థానిక జెన్‌కో అధికారులు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చేవారు. ఇకపై రియల్ టైం గవర్నెన్ పరికం ద్వారా నేరుగా ఎక్కడినుంచైనా తెలుసుకోవచ్చని జలవనరుల శాఖ ఏఈఈ రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఈ కె. అనుదీప్ పాల్గొన్నారు.

'బీజేపీలో కష్టపడేవారికి గుర్తింపు'



బీజేపీ నేత జ్ఞానేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు

గూడెంకొత్తవీధి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో కష్టపడే కార్యకర్తలు, నాయకులకు అధిష్ఠానం గుర్తిస్తుందని ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు అన్నారు. శనివారం దామనాపల్లి పంచాయతీ సిగినాపల్లి రామ్‌నగర్ కాలనీలో ఇటీవల మృతి చెందిన బీజేపీ సీనియర్ నేత దుక్కెరి జ్ఞానేశ్వరరావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. జ్ఞానేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు, బీజేపీ జిల్లా ఐటీ కన్వీనర్ పండ ఈశ్వరరావు, నాయకులు వసుపరి శ్రీనివాసరావు, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు పాల్గొన్నారు.

'తాజంగి' కాలువలు మరమ్మతులు చేపట్టాలి



అసిస్టెంట్ కలెక్టర్ ఫరీణ్‌కి వినతి పత్రం అందజేస్తున్న నీటి సంఘం చైర్మన్ తదితరులు

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాజంగి జలాశయం కెనాల్, పంటకాలువల మరమ్మతులు చేపట్టాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) ఫరీణ్‌ను కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నీటి సంఘం చైర్మన్ బోనంగి బాలయ్య పడాల్ కోరారు. శనివారం తాజంగిలో పర్యటించిన అసిస్టెంట్ కలెక్టర్‌ను గిరిజన రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాజంగి జలాశయం దిగువన సుమారు 1500 ఎకరాలకు సాగు నీరందించేందుకు 70ఏళ్ల క్రితం కుడి, ఎడమ కాలువలు నిర్మించారన్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలు కెనాల్స్ మరమ్మతులకు గురై నీరు వృధాగా పోతోందన్నారు. ప్రతి ఏటా కాలువుల మట్టితో పూడ్చుకుపోయి పొలాలకు పూర్తి స్థాయిలో సాగు నీరందడంలేదన్నారు. ఈ స్థితిలో కాంక్రిట్ కాలువలను నిర్మించాలని అసిస్టెంట్ కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంతల మహేశ్వరి, మాజీ సర్పంచ్ పెనుమల కాంతమ్మ, నీటి సంఘం ఉపాధ్యక్షుడు తమర్బ విశ్వనాథం, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి కిముడు గోపాల్, సీసా లవకుశ, స్కూల్ కమిటీ చైర్మన్ శెట్టి మోహనరావు, ఆంద్రాబు లక్ష్మణ్, శ్యాంసుందర్, బెన్నలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పూటూరులో తాగునీటి సమస్య పరిష్కరించరూ..



గ్రామంలో నీటి బావి వద్ద నిరసన తెలుపుతున్న గిరి మహిళలు

పెదబయలు, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ పూటూరు గ్రామంలో తాగునీటి సమస్యతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గ్రామంలో బోరు మరమ్మతు కావడంతో గ్రామ శివారు పంట పొలాల వద్ద గల బావి నీటిని సేకరించి తాగుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మహిళలు ఆందోళన వ్యక్తంచేశారు. బావి నీటితో అనేక రకాలైన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నట్టు వాపోయారు. బావివద్ద సోలార్ సిస్టం, మోటారు మూలకు చేరిందన్నారు. గ్రామానికి దిగువనఉన్న బావికి ఇరుకు బాటలో నడుచుకుంటూ వెళ్లి అతి కష్టం మీద నీటిని మోసుకోవాల్సి వస్తోందన్నారు. వృద్ధులు మరీ సమస్య ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యపై మండలం నుంచి జిల్లా స్థాయి అధికారులకు పలుమార్లు సమస్య విన్నవించినా స్పందన లేదని ఆరోపించారు. ఇకనైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సమస్య పరిష్కరించాలని ముత్యాలమ్మ, మచ్చమ్మ, కొండమ్మ, కాంతమ్మ, దేవి.పుష్పలమ్మ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనందరావు, మన్మధరావు, పోతురాజు డిమాండ్ చేశారు.

పాఠశాల భవనం ప్రారంభం



తర్లాగూడలో భవనాన్ని ప్రారంభిస్తున్న చేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనుగుమ్మ పంచాయతీ తర్లాగూడలో పాఠశాల నూతన భవనాన్ని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో విద్యార్థులు చిన్నపాటి పాకలో చదువుకునేవారని, ఈ నేపథ్యంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఎంపీటీసీ నిధులు రూ.2లక్షలు మం జూరు చేశారని చెప్పారు. ఆ నిధులతో భవనం పూర్తి చేసినట్టు చెప్పారు. భవనం నిర్మాణానికి కృషి చేసిన వైస్ ఎంపీపీ భాగ్యవతి, దేవ దంపతులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎం ఈవోక్రిష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, వైసీపీ నేతలు రాజేంద్ర, నీలకంఠం, పితాభాష్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : సీఐటీయూ



లేబర్ కోడ్ ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీచేసిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట లేబర్ కోడ్ ప్రతులను సీఐటీయూ నాయకులు, కార్మికులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులు, చట్టాలకు విఘాగతం కలిగే లేబర్ కోడ్‌లను కార్మికులు సంఘటితంగా ప్రతిఘటించాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల నాయకుడు కల్యాణం, కృపారావు, అంగన్‌వాడీ యూనియన్‌నేత రాని, శిరీష పాల్గొన్నారు.

అరకులోయ: మండల కేంద్రంలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలోని ఆందోళన శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులను మరింత బానిసత్వంగా మార్చేలా నాలుగు లేబర్‌కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో రాజు, అప్పలరాజు, సత్యారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కిరండూల్ పాసింజర్ దంతెవాడ వరకే..

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల దృష్ట్యా విశాఖ-కిరండూల్ మధ్య నడిచే పాసింజర్ రైళ్ల సర్వీసుల గమ్యాలను కుదించారు. విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈనెల 23 నుంచి 28 వరకు దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని 24 నుంచి 29 వరకు దంతెవాడ నుంచి విశాఖ చేరుకుంటుంది. దంతెవాడ, కిరండూల్ మధ్య రాకపోకలను రద్దుచేశారు.

13న మెగా లోక్ అదాలత్

చింతపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల మేజిస్ట్రేట్ న్యాయస్థానం పరిధిలో డిసెంబరు 13న మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి డి. భరణి తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీకి కుదిరిన కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చునన్నారు.

మెలకువలతో కాఫీ పండ్లలో అధిక నాణ్యత

జి.మాడుగుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాఫీ పండ్ల సేకరణలో మెలువకువలు పాటిస్తే అధిక నాణ్యతకు ఆస్కారం ఉంటుందని వ్యవసాయ రైతు సాధికార సంస్థ ఇన్‌చార్జి ఎం.ప్రసాదరావు సూచించారు. మండలంలో లువ్వాసింగి పంచాయతీ వలసమామిడి గ్రామంలో శనివారం కాఫీ రైతులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాఫీ పండ్లలో మంచి షుగర్ లెవల్ ఉండే వాటిని సేకరిస్తే నాణ్యత ఉంటుందని చెప్పారు. ఈ మేరకు బిక్స్ మీటర్‌తో షుగర్ కంటెంట్‌ను రైతులకు వివరించారు. ఈ మీటర్లో 18-20శాతం ఉంటే ఏ గ్రేడ్ వస్తుందన్నారు. ఈ రకమైన సేకరించిన పండ్లను ఎం.నిట్టాపుట్టు రైతు ఉత్పత్తిదారుల సంస్థ మ్యాక్స్‌లో కిలో రూ.65 వరకు ప్రకటించిన ధరకు అమ్మకాలు చేయాలని సూచించారు. లైసెన్స్ లేని ఇతర వ్యక్తులకుఅమ్మకాలు చేయరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామలింగం, రాంబాబు,బొంజుబాబు, సురేశ్ పాల్గొన్నారు.

మాడుగుల సబ్ రిజిస్ట్రార్‌గా సంజీవయ్య

... 5వ పేజీ తరువాయి

ఉంది. ఆ తరువాత ఆయన విజయవాడలోని ఐజీ కార్యాలయానికి వెళ్లిపోయారు. వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్ శాఖకు ఐజీగా ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఆయన దగ్గర చేరి, ఎక్కడెక్కడి నుంచి ఎలా వసూళ్లు చేయవచ్చునో వివరించి, ఆ బాటలోకి మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో ఐజీ కార్యాలయానికి అవసరమైన ఫర్నీచర్ కోసం సంజీవయ్య విశాఖపట్నం నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేసింది. ఆ ఐజీ వెనక్కి వెళ్లిపోయారు. మరో ఐజీ వచ్చారు. అప్పుడు కూడా సంజీవయ్య కొన్నాళ్లు తన హవా నడిపించారు. స్వామి కార్యం, స్వకార్యం పూర్తి చేసుకుంటున్నారని తెలిసి పక్కనపెట్టారు. కొద్దినెలల క్రితం కొత్త ఐజీ బాధ్యతలు తీసుకున్నారు. సంజీవయ్యతో జాగ్రత్తగా ఉండాలని కొందరు సూచించడంతో దూరం పెట్టారు. రెండు రోజుల క్రితం అక్కడి నుంచి మాడుగుల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లాలో మాడుగుల పెద్దగా ఆదాయం ఉండని ప్రాంతం. అక్కడ పనిచేసే సబ్ రిజిస్ట్రార్ మొన్న జూన్‌లో పదవీ విరమణ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌తోనే నడిపిస్తున్నారు. ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో సంజీవయ్యను నియమించారు. సోమవారం బాధ్యతలు చేపడతారని తెలిసింది. ఐటీవల విశాఖలో డీఐజీ కార్యాలయానికి వచ్చి మాడుగుల కాకుండా మరేదైనా పోస్టింగ్ కోసం యత్నించి విఫలమైనట్టు సమాచారం.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

» ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్



అవగాహన ర్యాలీ ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

పాడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదాతోపాటు విద్యుత్ ఛార్జీల ఖర్చు తగ్గించుకునేందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీఎస్.ప్రసాద్ అన్నారు. సోలార్ రూఫ్ టాప్‌పై ప్రజల్లో అవగాహనకు జిల్లా కేంద్రంలో శనివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులకు ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాయితీపై సోలార్ రూఫ్ టాప్‌ను అందిస్తోందన్నారు. ఒక్కసారి దీనికి పెట్టుబడి పెడితే 20 ఏళ్ల గృహ అవసరానికి విద్యుత్‌ను వినియోగించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఈఈ పి. వేణుగోపాల్, ఏవో శ్యామలరావు, టెక్నికల్ ఈఈ ఎల్.చిన బాబుపాత్రుడు, ఇం జనీర్లు ఎం.వెంకటరమణ, ఎం.వి.రమణ, లైన్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్.త్రిమూర్తులు, జె.అప్పలరాజు, లైన్‌మెన్లు సీహెచ్.కొండలరావు, డి.శ్రీనివాసరావు, పి.సంజీవరావు, పి.సోమేశ్వరరావు, పి.సింహాచలం, పోలీసు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షాలో అక్రమాలెన్నో!

... 5వ పేజీ తరువాయి

కంప్యూటర్స్ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అయితే ఎటువంటి అర్హతలు లేకపోయినా ఒక ఉపాధ్యాయుడ్ని ఏఎస్‌వోగా నియమించారు. అసిస్టెంట్ స్టాటస్టికల్ అధికారి పోస్టుకు జిల్లాకు చెందిన 9 మంది దరఖాస్తులు చేసుకోగా, ఎవరికీ అవకాశం ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధం గా ఏఎస్ఆర్ జిల్లా నుంచి ఒక ఉపాధ్యాయుడ్ని ఏఎస్‌వోగా నియమించారు. ఇవే కాకుండా మొత్తం ఏడు పోస్టులను అధికారి తనకు అనుకూలమైన ఉపాధ్యాయులను ఎటువంటి విద్యార్హతలు లేకుండానే నియమించినట్టు తెలిసింది. ఇప్పటికే సమగ్ర శిక్షా విభాగంలో అక్రమ డిప్యూటేషన్‌ల వ్యవహారంలో విచారణ నివేదిక ఆధారంగా ఏపీసీ జయప్రకాశ్‌కు షోకాజ్ నోటీసు జారీచేసి, మాతృ సంస్థ అయిన కళాశాలకు అధ్యాపకుడిగా పంపారు. ఆయన స్థానంలో కొత్తగా ఒక మహిళా అధికారిని నియమించారు. అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న మరికొందరిపై త్వరలో చర్యలు తప్పవని అంటున్నారు. సమగ్ర శిక్షాలో అడ్డగోలుగా సాగిన డిప్యూటేషన్ల వ్యవహారంలో మరికొందరిని విచారించేందుకు అధికారులు సిద్ధమవుతుండడంతో విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదేం తీరువా?

... 5వ పేజీ తరువాయి

అయింది. ఇంకా రూ.15 కోట్లు బకాయిలు వసూలు కావలసి ఉంది.

నీటి పన్ను బకాయిలు వసూలు చేయాల్సిందే...

గత నెలలో అనకాపల్లిలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆధ్వర్యంలో సాగునీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, ఇరిగేషన్ ఎస్ఈ, డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కొంత మంది నీటి సంఘాల అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల నుంచి నీటి తీరువా బకాయిల వసూళ్లపై చర్చించారు. జిల్లాలో సాగునీటి పథకాల నిర్వహణ అధ్వానంగా ఉందని తెలిపారు. సాగునీటి పథకాల మరమ్మతులు, కాలువలో పూడిక సమస్యలు ఉన్నాయని ప్రాజెక్ట్ చైర్మన్లు సమస్యను లేవనెత్తారు. నీటి తీరువాల బకాయిలు వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. పంట కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్చి నెలాఖరుకల్లా బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేస్తాం

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టరుకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించడంతో పాటు, రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కూడా విడుదల చేసిందని జడ్జికి వివరించారు. కాంట్రాక్టరు కూడా బీ ఎన్ రోడ్డు పనులు ప్రారంభించారని, ఈ పనులు మార్చి నెలాఖరుకల్లా పూర్తవుతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాది డేవిడ్ బీఎన్ రోడ్డులో దెబ్బతిన్న విజయరామరాజుపేట, వడ్డాది వంతెనల నిర్మాణం గురించి జిల్లా జడ్జి దృష్టికి తీసుకుని వెళ్లగా, విజయరామరాజుపేట వంతెన కూడా మార్చిలోగా పూర్తి చేస్తామని, వడ్డాదిలో వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి రూ26 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ఆ నిధులు మంజూరైతే వడ్డాది వంతెన నిర్మాణం చేపడతామని వివరించారు. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల వాదనలు లిఖిత పూర్వక హామీని పరిగణలోనికి తీసుకున్న 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ కేసును జనవరి 29కి వాయిదా వేశారు.

రోడ్డు పనుల పురోగతిని బట్టి న్యాయపోరాటం

బీఎన్ రోడ్డు పనులు మార్చిలోగా పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు లిఖిత పూర్వక హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ తెలిపారు. పనుల పురోగతిని పరిశీలిస్తామని, పనుల్లో మళ్లీ జాప్యం జరిగితే న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

త్రివర్ణపతాకాన్ని, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హోం మంత్రి అనితకు హాకీ క్రీడాకారులు ఘనంగా క్రీడా స్వాగతం పలికారు. ముందుగా హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి హోం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. విశాఖ డీఈవో పి.ఉమారాణి, డీఐఈవో వినోద్‌రాజు, ఆర్ఐవో మురళి, డీఎస్‌డీవో పూజారి శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీపీ పుష్పలత, హాకీ క్లబ్ ప్రతినిధులు సూరిబాబు, చిన్న అప్పారావు, రామచంద్రరావు, తాతాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా తొలిరోజు పోటీలు

తొలిరోజు నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ మైదానంలో జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలుర విభాగంలో ప్రకాశం జట్టుపై కడప, విజయనగరంపై గుంటూరు, కృష్ణా జిల్లా జట్టుపై నెల్లూరు, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి, గుంటూరుపై అనంతపురం, పశ్చిమ గోదావరి జట్టుపై చిత్తూరు, కృష్ణా జిల్లా జట్టుపై విశాఖ జట్లు విజయం సాధించాయి.

బాలికల విభాగంలో విజయనగరం జట్టుపై ప్రకాశం, నెల్లూరుపై కడప, పశ్చిమగోదావరిపై విశాఖ, పశ్చిమ గోదావరి జట్టుపై తూర్పు గోదావరి జిల్లా జట్లు విజయం సాధించాయి.

అలజడి సృష్టించిన ఇద్దరి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

హత్యాయత్నం సెక్షన్‌తో పాటు, ఎస్‌డీపీసీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. వీరిని జడ్జి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని ఆమె తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీసులను ఆమె అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ అప్పలరాజు, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ నాగకార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

... 5వ పేజీ తరువాయి

ఉన్నవి వదిలిపెట్టి, కోర్టు పరిధిలో లేని వివాదాలకు సంబంధించి ఇరువర్గాలతో మాట్లాడి సాధ్యమైనంత వరకూ పరిష్కరించాలని సూచించారు. మండల, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సర్వే ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి ఎస్. గోపాలరాజు, జిల్లా ల్యాండ్ సర్వే ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకన్న, తహశీల్దార్ బి. చిన్నికృష్ణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, మండల ఆర్ఐ వీరయ్య, సర్వేయర్లు లోకేశ్, వీఆర్వో అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

భారీఎత్తున విశాఖ ఉత్సవ్

... 5వ పేజీ తరువాయి

చేసేవారు. ఈసారి అంతకు మించి నిర్వహించాలని, కనీసం ఐదు రోజులు, గరిష్ఠంగా వారం రోజులు ఉత్సవ్ ఉండాలని ప్రభుత్వ పెద్దలు సూచించినట్టు సమాచారం. యోగాంధ్ర మాదిరిగా భారీఎత్తున నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పే ఆలోచనలో ఉన్నారు. ఇందులో భాగంగా భారీ అలంకరణలతో 'క్రిస్మస్ ట్రీ' పెడతారని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఏ ఉత్సవమైనా నిధులు చాలా ముఖ్యం. పర్యాటక శాఖకు ఇదే పెద్దలోటు. వీటిని ఎలా సమకూరుస్తారనే దానిపై కూడా చర్చలు జరుగుతున్నాయి. వీటిపై రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉంది.



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి, ఇతర జడ్జిలు

డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

» 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ కోరారు. స్థానిక కోర్టు హాలులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి చోడవరం, మాడుగుల సర్కిళ్లకు చెందిన పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పలు కేసులకు సంబంధించి పోలీసులకు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు. జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ, అడిషనల్ సివిల్ జడ్జి సూర్యకళ, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రమణమ్మ, ఏపీపీ హరిప్రియ, మధులత, సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం లబ్ధిదారులకు అందించారు. తన చాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్ష్మీపురానికి చెందిన కాకర చిలుకమ్మ, బోయిన వరహాలుకు రూ.25 వేలు, రూ.30 వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూతనాధు నానికుమార్, సీనియర్ నేత సిరిసోళ్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో రూ.1.5 లక్షల అందజేత

రోలుగుంట: మండలంలోని నిండుగొండ గ్రామానికి చెందిన లాలం అప్పలనాయుడు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో, అతని వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.5 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ సుర్ల బాబులునాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు కాళ్ల వరహాలునాయుడు, టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి లగుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల నర్సీపట్నం యూనిట్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నర్సీపట్నం యూనిట్ ఎన్నికలు శనివారం జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సీపట్నం యూనిట్ అధ్యక్షుడిగా వై.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వై.శివగణేశ్, కార్యదర్శిగా కె.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఆర్.వెంకటరావు, ట్రెజరర్‌గా ఎస్.దావీద్ మదూర్, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్‌వీఎస్ అజయ్, ఏహెచ్‌వీ సురేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంగాధర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నర్సీపట్నం, నాతవరం మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాన్ టీచింగ్ సిబ్బంది, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక



తహశీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలపై ప్రజావేదిక

గొలుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రజావేదికను నిర్వహిస్తున్నదని డిప్యూటీ తహశీల్దార్ చైన్సు చెప్పారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఎస్‌ఐ రామారావు, పలు శాఖల అధికారులతో కలిసి ప్రజావేదిక నిర్వహించారు. ఈ వేదికలో పాకలపాడు గ్రామంలో భూ సమస్యలు, కశిమి, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఇరువర్గాలతో చర్చించినట్టు డీటీ తెలిపారు. సమస్య పరిష్కార ం కాకపోవడంతో వచ్చే వారానికి వాయిదా వేసినట్టు చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ కోరారు.

భూ వివాదాలపై విచారణకు కమిటీ



ఫిర్యాదులపై విచారణ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలపై విచారణ చేపట్టేందుకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ బి.వెంకటరమణ చెప్పారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపాలెం, రాచపల్లి, జి.కోడూరు గ్రామాల్లో భూ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉంటే నేరుగా తనను కలవాలని సూచించారు. అలాగే ప్రతీ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని, ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులు ప్రతి శనివారం సమావేశం నిర్వహించి పరిష్కరిస్తారని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

కొత్త లేబర్ కోడ్స్‌పై కార్మికుల ఆందోళన

» లేబర్ కోడ్ నోటిఫికేషన్ ప్రతుల దహనం



నర్సీపట్నం పాత మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం/చోడవరం/కె.కోటపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులకు హరించే లేబర్ కోడ్స్ నోటిషికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళనకు దిగారు. చేశారు. ఈ సందర్భంగా లేబర్ కోడ్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. నర్సీపట్నం, చోడవరం, కె.కోటపాడు కేంద్రాల్లో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు.

నర్సీపట్నంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసమే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా భవిష



చోడవరంలో లేబర్ కోడ్ గెజిట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

త్తులో పోరాటాలకి కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చోడవరంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాలను 12 గంటలకు పెంచి వెట్టికూలీలుగా మార్చే నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలు కార్మికుల జీవితాలను మరింత దుర్భరం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కె.కోటపాడులో సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లి నాయుడుబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులపై అదను చూసి దెబ్బ కొట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు ఎస్‌వీ.నాయుడు, రొంగలి ముత్యాలనాయుడు వనము సూర్యనారాయణ, రొంగలి గోపి, సిరపరపు రాము, టి. కృష్ణమ్మ, ఎల్. పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో గోతులు పూడ్చాలని నిరసన

రావికమతం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు గోతులు పూడ్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలిపారు. కొత్తకోటలో రోడ్డుపై మోకాళ్లపై నిల్చొని ఈ కార్యక్రమం చేపట్టారు. నాలుగు జిల్లాలను కలిపే బీఎన్ రోడ్డును పాలకులు, అధికారుల నిర్లక్ష్యంగా వదిలేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను తలపించే గుంతలతో సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోవడంతో పాటు తరచూ ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సిహెచ్.శంకర్రావు, పాంగి చంద్రయ్య పాల్గొన్నారు.

అమరావతిలో అసెంబ్లీ కార్యక్రమానికి మంచాల విద్యార్థి ఎంపిక



నారాయణమూర్తి

చీడికాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈ నెల 26న జరిగే ప్రత్యేక అసెంబ్లీ కార్యక్రమానికి మంచాల మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి రావాడ నారాయణమూర్తి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికకాగా, మాడుగుల నియోజకవర్గానికి సంబంధించి నారాయణమూర్తి ఎంపికైనట్టు ఆమె చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కృష్ణాదేవిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాతకృష్ణాదేవిపేటలో నిరుపేద వృద్ధులకు నిరుపేదలకు శివారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, పరిదేశుపాకల గ్రామాలకు చెందిన 50 మందికి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం పీవీ రమణ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

స్నానానికి దిగి కెరటాల తాకిడికి కొట్టుకుపోయిన వైనం



గల్లంతైన శ్రీఆదిత్య, తేజస్ (ఫైల్)

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు విద్యార్థులు కెరటాల తాకిడికి గల్లంతవ్వగా, మరో ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం నగరంలోని వుడా పార్కు వెనుక బీచ్‌లో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బుల్లయ్య కళాశాలలో డిగ్రీ మైక్రో బయాలజీ మూడో సంవత్సరం చదువుతున్న నరేంద్రపురపు శ్రీఆదిత్య (20), మానేపల్లి తేజస్ (20), మరో ఆరుగురితో కలిసి శనివారం సాయంత్రం వుడా పార్కు వెనుక ఉన్న బీచ్ లైట్‌హౌస్ వద్దకు వెళ్లారు. కాసేపు బీచ్‌లో సరదాగా గడిపారు. శ్రీఆదిత్య, తేజస్‌లతో పాటు మరో ఇద్దరు సముద్ర స్నానానికి దిగారు. నలుగురు స్నానం చేస్తుండగా అలల తాకిడికి లోపలకు కొట్టుకుపోయారు. వారిలో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. శ్రీఆదిత్య, తేజస్‌లు అలల్లో చిక్కుకుని గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. రాత్రి 11 గంటలకు కూడా ఆచూకీ లభించలేదు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్‌ఐ అర్జున్ తెలిపిన వివరాలివి. ఇక్కడి జాతీయ రహదారిలోని పూడిమడకకు వెళ్లే జంక్షన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి సుమారు నలభై సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఉన్నాడు. ఇంతలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు అతనిని ఢీకొని వెళ్లిపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నక్కపల్లి టోల్ గేటు వద్ద బస్సును అదుపులోకి తీసుకున్నారు. మృతుడు 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయ, నీలం తెలుపు ఉంటాడన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

అచ్యుతాపురం రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెంలో విద్యుదాఘాతంతో మురముళ్ల కొండబాబు (27) మృతి చెందారు. వివరాలివి.. పెయింటర్‌గా పనిచేస్తున్న కొండబాబు శనివారం ఉదయం గ్రామంలో జామి వెంకటరమణ అనే వ్యక్తి ఇంటికి సున్నం వేయడానికి వెళ్లారు. ఇంటి వెలుపల సున్నం వేస్తుండగా భవనాన్ని ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి షాక్ గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామంలో టిఫిన్ షాపు నడుతూ జీవనాన్ని సాగించే మురమళ్ల సన్యాసిరావుకు కొండబాబు, సాయికుమార్ ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడైన కొండబాబు అర్థాంతరంగా మృత్యువాత పడడంతో తల్లితండ్రులు రోదిస్తున్నారు. తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖరరావు తెలిపారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న తాతయ్యబాబు



శ్రీవారి కొండపై తాతయ్యబాబు, గవిరెడ్డి

బుచ్చెయ్యపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకన్నను స్టేట్ హౌసింగ్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో కలిసి శనివారం తెల్లవారు జామున శ్రీవాయాయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా తాతయ్యబాబు ఆకాంక్షించారు. వారితో పాటు వారి బంధువులు స్వామిని దర్శించుకొన్నారు.

అల్లూరి పార్కులో పర్యాటకుల సందడి

కృష్ణాదేవిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పార్కులో శనివారం పర్యాటకులు సందడి చేశారు. కార్తీకమాసం చివరి శనివారం కావడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు పార్కుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గంటందొరల సమాధులను సందర్శించి నివాళులర్పించారు. ఇక్కడ ప్రకృతి సౌందర్యాలను పర్యాటకులు తిలకించి పులకించిపోయారు. పార్కులో అందమైన రాయిపై ఆటపాటలతో గడిపారు. అనంతరం వన భోజనాలు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాతవరం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులంతా జాబ్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సత్యశ్రీనివాసు సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపు కోసం సభ ఏర్పాటు చేశామన్నారు. చెరువులు, ఉద్యావన పనులు చేయాలని గ్రామసభలో తీర్మానించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అప్పలనర్స, సర్పంచ్ రాణీ, పీఏసీఎస్ ఛైర్మన్ మాణిక్యం, పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్, ఈసీ రాధిక, వీఆర్‌పీలు నాగబాబు, రాఘవ, టీడీపీ నాయకులు శెట్టి లోవ, చింతకాయల శ్రీనివాసు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన

మాడుగుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి, ఎంఈవో ఈశ్వరరావు శనివారం పరిశీలించారు. మాడుగుల జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు కేజేపురం జిల్లా పరిషత్, తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలిక పాఠశాలలోని పరీక్షలు నిర్వహించే గదులను వారు నిశితంగా పరిశీలించారు. డెస్కులు, ఫ్యాన్లు, విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? లేదా? అని ఆరా తీశారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులను వారు ఆదేశించారు. అలాగే పరీక్ష నిర్వహణకు సంబంధించి వారు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు బండారు ముత్యాలనాయుడు, బాబి, రమాదేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలపై ప్రత్యేక దృష్టి

» అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం

» పోలీసు కుటుంబాల సంక్షేమమే ధ్యేయం

అనకాపల్లి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కుటుంబాల సంక్షేమమే తన ధ్యేయమని ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాలపై శనివారం ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. బాధిత కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గ్రాడ్యుటీ, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, జీఐఎస్, డెత్ బెనిఫిట్స్ వంటి ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. అలాగే, కారుణ్య నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణలో మరణించిన ఆరుగురు పోలీసుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహనరావు పాల్గొన్నారు.

దివంగత జడ్పీటీసీ నూకరాజు భూమి సరిహద్దుల గుర్తింపు

రోలుగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు జడ్పీటీసీ వారా నూకరాజు భూమిని రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించారు. తహశీలారద్ నాగమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు బృందాలు సంయుక్తంగా సర్వే నంబర్ 139లో ఖాళీగా ఉన్న వారా నూకరాజుకు చెందిన 7.39 ఎకరాల భూమిని సర్వే బృందంతో సర్వే చేసి సరిహద్దులు నిర్వహించారు. గిరిజనులు సాగులో ఉన్న 2.5 ఎకరాల భూమి ప్రస్తుతం కోర్టు కేసులో ఉన్నందున సదరు భూమిని ఎటువంటి సర్వే చేయకుండా వదిలేశారు. ఈ నివేదికను ఉన్నతాదికారులకు అందచేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. రోలుగుంట మండలం, ఎంకేపట్నం పంచాయతీ శివారు ఛటర్జీపురంలో సర్వే నంబర్ 139లోని 10.83 ఎకరాల భూమికి సంబంధించి పట్టా నూకరాజు పేరునే ఉన్నట్టు సమాచారం.న

జడ్సీపై చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది ఆందోళన



జోనల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు శనివారం సాయంత్రం ఇక్కడి జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తొమ్మిదవ సచివాలయం వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఎం.నూకరాజు ఈ నెల 20వ తేదీన తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగానే చనిపోయాడని వారు వాపోయారు. జోనల్ కమిషనర్ చక్రవర్తి నూకరాజుకు సెలవు మంజూరు చేయకపోవడం, విపరీతమైన పనిఒత్తిడి వంటి కారణాల వల్ల మానసిక ఒత్తిడికి గురై మృతి చెందాడని సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మహిళా ఉద్యోగులను కూడా అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే జోనల్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగించి, మృతుడు నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోని వీఆర్వోల కార్యాలయంలో శనివారం నూతన కార్యవర్గం పేర్లు వెల్లడించారు. సంఘం మండల అధ్యక్షురాలుగా డీవీ లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా వి.భూపతిదేవ్, కార్యదర్శిగా ఎస్ఎన్ఎస్.శివభాస్కర్, సహాయ కార్యదర్శిగా సిహెచ్.మోహన్‌దుర్గా, కోశాధికారిగా సన్యాసి సాహెబ్ ఎన్నికయ్యారు. తహశీల్దార్ రామారావును వీరంతా కలిసి పరిచయం చేసుకున్నారు. నూతన కార్యవర్గానికి ఆయన అభినందలు తెలిపారు.

మెప్మా అర్బన్ బజారు ఏర్పాటు

నర్సీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయం గేటు పక్కన పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శనివారం అర్బన్ బజారును ఏర్పాటు చేశారు. ఈ బజారులో చీరలు, గాజులు, పండి వంటలు, తినుబండారాలు, మట్టి పాత్రలు, పప్పు ధాన్యాలు, బొమ్మలు, పండ్లు, కూరగాయలు విక్రయించారు. మొత్తం రూ.31,400 అమ్మకాలు జరిగాయని సీవో రమాదేవి తెలిపారు. ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల ఈకేవైసీపై గ్రామసభలు

గొలుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకం జాబ్ కార్డుల ఈకేవైసీపై శనివారం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించారు. ఏటిగైరంపేట, గొలుగొండ, జోగంపేట, పాకలపాడు, కొత్తఎల్లవరం, పాతమల్లంపేట, రావణాపల్లి, కొత్తమల్లంపేట గ్రామాల్లో ఈ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఏటిగైరంపేట సభలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రమామణి మాట్లాడుతూ మండలంలోని 19064 మంది కూలీలకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. వారిలో 16315 మంది కూలీలకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారు కూడా ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ కసిపల్లి అప్పారావు, ఎంపీటీసీ సభ్యులరాలు చింతల కాంతం, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట: ఉపాధి పథకంలో సమస్యలను పరిష్కరించడానికి శనివారం 24 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించారు. అలాగే పలు గ్రామాల్లో జాబ్‌కార్డులు లేనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఏయే గ్రామాల్లో ఏయే పనులు కల్పించాల్లో గ్రామసభల్లో చర్చించి నివేదికలు తయారు చేశారు. ఏపీవో ఈశ్వరరావు, సర్పంచులు, కూలీలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని బి.కింతాడలో ఉపాధి పనులపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన 72 పనులను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ఉద్యానవనాలు, కాలువలు, చెరువులు, మట్టి రోడ్లు, పంట పొలాలకు ఉపయోగపడే పనులపై చర్చించినట్టు చెప్పారు. ఈ సభలో సర్పంచ్ బాబూరావు, పంచాయతీ కార్యదర్శి అర్జున్, నాయకులు కొమార బాబూరావు, నరసింగరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

దేవరాపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం మారిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడు కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పౌర హక్కులు, బాధ్యతలతో పాటు పోలీసు వ్యవస్థపై సమన్వయంతో మెలగడం వంటి అంశాలపై ఈ సందర్భంగా ప్రజలకు ఎస్‌ఐ అవగాహన కలిగించారు.